సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 30 । డిసెంబర్ । 2023



రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిపాలనను చూసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు.

- 8లో



సార్వత్రిక ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంపై దృష్టిసారించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.

- 8లో

34 మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. 34 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే వారంరోజుల్లో కార్యాలయానికి సమర్పించాలని డీడీ మంగవేణి సూచించారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయికి మన్యం ప్రాజెక్టు



విద్యాశాఖ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా కడపలో అవార్డు తీసుకుంటున్న చరణ్‌తేజ, తదితరులు

పాలకొండ రూరల్: కడప కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ప్రదర్శించిన గ్యాస్ సిలిండర్లను మెట్లపైకి సులభంగా తీసుకువెళ్లే యంత్రం ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పాలకొండ మండలం ఎం.సింగిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కె.చరణ్‌తేజ తమ సైన్స్ ఉపాధ్యాయిని హైమావతితో కలిసి రూపొందించిన ప్రాజెక్టుకు ఉత్తమ స్థానం దక్కిందన్నారు. సౌత్ ఇండియా స్థాయిలో త్వరలో జరగనున్న వైజ్ఞానిక పోటీల్లో ఈ ప్రదర్శన జిల్లా నుంచి స్థానం దక్కించుకున్నట్టు వివరించారు. విద్యార్థినితో పాటు టీచర్‌ను డీఈఓ కె.ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం బి.సంగంనాయుడు, సహోపాధ్యాయులు అభినందించారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.4.47లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయ శాఖ ఉద్యోగులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి ఆలయాల హుండీ ఆదాయాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, కార్యనిర్వహణ వీవీ సూర్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. వేంకటేశ్వర స్వామివారి ఆలయ హుండీల నుంచి రూ.4,47,605, కోదండరామస్వామి ఆలయంలోని హుండీల నుంచి రూ.11,152 లభించింది. లెక్కింపు ప్రక్రియను పాలకొండ గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి సర్వేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గౌరీశంకర్ పాత్రో, కుసుమూరు సాగర్, ఆలయ సేవకులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో 533 గ్రామాల్లో రీసర్వే పూర్తి



సర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ త్రివిక్రమరావు

లక్కవరపుకోట: భూముల సమగ్ర రీసర్వేలో భాగంగా జిల్లాలో 533 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు సర్వేశాఖ ఏడీ త్రివిక్రమరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మండలంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమంపై ఆరా తీశారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎఫ్‌ఎంబీలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతగా 179 గ్రామాలు, రెండో విడతగా 198 గ్రామాలు, మూడో విడతలో 160 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సుమారు 6లక్షల హద్దురాళ్లను పాతినట్లు చెప్పారు. ఇంకా జిల్లాలోని 450 గ్రామాల్లో రీసర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 90 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. రీసర్వే నిర్వహణలో రాష్ట్రంలో విజయనగరం జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. అలాగే జిల్లాలోని 777 గ్రామ కంఠాలకు గాను ఇప్పటి వరకు 110 గ్రామ కంఠాల్లో సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. మండల సర్వేయర్ గ్రంధి రామం, సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

కొత్త విషయాలు నేర్చుకోవాలి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో శిక్షణ పొందిన తెలంగాణ విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, వృత్తి సంబంధమైన కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు భేష్

- భవన నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేయాలి
- రంగుమారిన ధాన్యం కొనుగోలులో సమస్యలు వస్తే పరిష్కరించాలి
- సంక్రాంతిలోపే పంట నష్టపోయిన రైతులకు పరిహారం
- పండగ వాతావరణంలో పింఛన్లు, చేయూత, ఆసరా మొత్తాల పంపిణీ
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న డిప్యూటీసీఎం, డిప్యూటీస్పీకర్, జెడ్పీచైర్మన్, కలెక్టర్లు

విజయనగరం రూరల్:

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు అమలుచేయడంలో రాష్ట్రంలోనే ఉమ్మడి విజయనగరం జిల్లా తలమానికంగా నిలుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గుర్తించిన వెంటనే ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడంతో ఆయా పథకాల అమలు సమర్ధవంతంగా చేయగలుగుతున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారం

పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఉన్న సమస్యలకు సంబంధించి రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించినట్టు మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో 4065 మెట్రిక్ టన్నులు, మన్యం జిల్లాలో 100 నుంచి 150 మెట్రిక్ టన్నుల మేర రంగు మారిన ధాన్యం ఉన్నట్టు అంచనా వేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు. పాడైన, రంగుమారిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఎక్కడైనా ఒకటి రెండు చోట్ల ఉంటే వాటిని వెంటనే అధికారులు పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వం 4.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ధాన్యం రైతుభరోసా కేంద్రాలకు వచ్చే అవకాశం లేదన్నారు. విజయనగరం జిల్లాలో 1.40లక్షల టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని, రూ.135 కోట్ల బ్యాంకు గ్యారంటీలు తమ వద్ద సిద్ధంగా ఉన్నట్టు పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి వివరించారు. ధాన్యం ఇతర జిల్లాలకు తరలించకుండా జిల్లాలోని రైస్ మిల్లులకే పంపించేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల అధికారులకు మంత్రి ఆదేశించారు. రెండు జిల్లాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం దాదాపు రూ.70 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని, సంక్రాంతి పండగలోగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.

భవన నిర్మాణాల పూర్తికి కృషి

ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలను వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. వివిధ స్థాయిల్లో ఉన్న భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు ఏ మేరకు నిధులు అవసరమో తెలియజేస్తే, ప్రభుత్వం నుంచి విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భవన నిర్మాణాలు ఎన్నికలలోగా పూర్తిచేసేలా మండల స్థాయి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రూ.కోటి విలువైన ఆస్తులు సృష్టించామన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో గ్రామస్థాయిలో ఎంతో పగడ్బందీ వ్యవస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

బొబ్బిలి పంచాయతీరాజ్ ఈఈపై ఆగ్రహం

ఉపాధిహామీ కన్వర్జెన్స్ నిధులతో చేపట్టిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు అంచనా వ్యయాన్ని చెల్లించేందుకు బొబ్బిలి పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు నిరాకరిస్తున్నారని తెర్లాం ఎంపీపీ ఉమాదేవి సమావేశంలో ప్రస్తావించగా, ఈ విషయంలో ఇ.ఇ శ్రీనివాసరావు వ్యవహారశైలి పట్ల మంత్రి బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. బిల్లుల చెల్లింపుల విషయాన్ని పలుమార్లు ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసినప్పటికీ అభ్యంతరాలు చెప్పడంపై జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎమ్మెల్సీలు రఘురాజు, రఘువర్మ, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, ఉమ్మడి జిల్లాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం చేసే ప్రతీ మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసనసభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు మంత్రి బొత్స సూచించారు. ప్రభుత్వం చేసే మంచిని వివరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్నీ నెరవేర్చామనే సంతృప్తితో ప్రజల వద్దకు వెళ్తున్నామని చెప్పారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాల నిధులు విడుదల చేస్తోందని, వాటిని ఆయా మండలాల్లో ప్రజలను సమీకరించి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చేనెల నుంచి పింఛన్ మొత్తాలను రూ.3000లకు పెంచి అందజేస్తున్నందున జనవరి 3 నుంచి 8 వరకు జిల్లాలోని రోజుకో మండలంలో కార్యక్రమం ఏర్పాటుచేసి పండగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. జనవరి 3న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం అన్ని గ్రామాలు, వార్డుల్లో వినేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో శాసనసభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, స్థానిక ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలని కోరారు. జనవరి 23 నుంచి 31 వరకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం కింద నాలుగో విడత ఆర్థిక సహాయం పంపిణీ ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు చేయూత పథకంలో మహిళలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం చేపడతామన్నారు.

రూ.1045 కోట్లతో జెడ్పీ బడ్జెట్



జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో 2024-25 జెడ్పీ అంచనా బడ్జెట్‌ను సభ్యుల నుంచి ఆమోదం లభించింది. రూ.1045.16 కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1016.60 కోట్ల ఖర్చులు పోగా రూ. 28.55 కోట్ల మిగులు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఏడాది రాబడులు రూ.101.97 కోట్లు ఉంటాయని పేర్కొంటూ బడ్జెట్‌ను సమర్పించారు. 2023-2024 సవరణ బడ్జెట్‌కు సమావేశంలో ఆమోదం తెలిపారు. 2023-2024లో అంచనా రాబడులు రూ. 1010.37 కోట్లుగా ఉంటాయని, ప్రారంభ నిల్వతో కలుపుకొని ఆదాయం రూ.1025.80 కోట్లుగా అంచనా వేశారు. ఖర్చులు రూ.1000.40 కోట్లు పోను రూ.25.39 కోట్లు మిగులు నిల్వ ఉంటుందని అంచనా వేశారు.

యాజమాన్య పద్ధతులతో మత్స్యసాగు బాగు

- జిల్లా మత్స్యశాఖాధికారి తిరుపతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య

పార్వతీపురంటౌన్: చేపలపెంపకంలో సరైన యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధిక లాభాలు వస్తాయని జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య అన్నారు. చేపల పెంపకంలో నాణ్యమైన యాజమాన్య పద్ధతులు, చేపల విక్రయంలో మెలకువలపై పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సామాజిక భవనంలో ఏపీ ఇరిగేషన్ లైవ్ హుడ్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు (ఏపీఐఎల్ఐపీ) ఆధ్వర్యంలో మత్స్యకారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నీటి పారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్టు, వరల్డ్‌బ్యాంకు ప్రాజెక్టు కింద గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామానికి చెందిన తామర చెరువు, దళాయివలస గ్రామానికి చెందిన కొంకమయ్య చెరువు, హిక్కింవలస గ్రామానికి చెందిన జగన్నాథ పట్నాయిక్ చెరువు, బలిజిపేట మండలం అరసాడ గ్రామానికి చెందిన జంగమ్మనాయుడు చెరువు, అజ్జాడ గ్రామానికి చెందిన సూరాపుట్యాంకులు ఎంపికయ్యాయని తెలిపారు. ఐదు చెరువుల్లో గత నెల 21న 1,11,800 ఫింగర్ రింగ్స్ చేప పిల్లలను విడిచిపెట్టామన్నారు. మత్స్యకార సంఘాలకు 75 శాతం సబ్సిడీతో వలలు, ఐస్ బాక్సులు, మొబైల్ ఫిష్ వెల్డింగ్ యూనిట్ల కోసం ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. జిల్లాలో 70 ఫిష్ ఆంధ్రా షాపులలో వ్యాపారం సాగుతోందని తెలిపారు. 20 మందికి కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు, మురళీ, మెప్మా ఏపీడీ పి.విజయకుమార్, ఎస్‌జీఓ కోఆర్డినేటర్ వేణుగోపాలరావు, ఫిష్ఆంధ్రా లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

వంగర: స్వయం శక్తి సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమై, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ(అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్) కె.సావిత్రి ఆకాంక్షించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి ఆధ్వర్యంలో శుక్రవారం సీసీలు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. స్త్రీనిధి, సీఐఎఫ్, హెచ్‌డీఐఎఫ్‌ల ద్వారా పొందిన రుణాల రికవరీ శతశాతం చేపట్టాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈల ద్వారా ప్రతీ మండలంలో 500 మంది మహిళలకు రుణాలు మంజూరు చేసి, మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీనిధి జీవనోపాధుల ద్వారా ఈ ఏడాది రుణ లక్ష్యం రూ.157 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.130 కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో రాజాం వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన లబ్ధి.. రూ.10.41 కోట్లు



చెక్కును విడుదల చేస్తున్న జేసీ ఆర్.గోవిందరావు

- జిల్లాలోని 16,033 మంది విద్యార్థుల చదువుకు ఆర్థిక అండ

పార్వతీపురం: పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల చదువుకు ఆర్థిక అండ అందిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన నిధులను శుక్రవారం విడుదల చేసింది. విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భీమవరంలో శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ రోణంకి గోవిందరావు, లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థుల చదువుకు అయ్యే పూర్తిఖర్చు/ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. జిల్లాలో వెనుకబడిన తరగతులకు చెందిన 9,534 మంది విద్యార్థులకు రూ.6,53,56,353, షెడ్యూల్డు తెగలకు చెందిన 3,413 మందికి రూ.1,57,52,457, షెడ్యూల్డు కులాలకు చెందిన 2,391 మందికి రూ. 1,75,97,097, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన 480 మందికి రూ.37,32,160, కాపు కులానికి చెందిన 175 మందికి రూ.13,46,904, ముస్లిం మైనారిటీకి చెందిన 29 మందికి రూ.2,21,877, క్రిస్టియన్ మైనారిటీకి చెందిన 11 మంది విద్యార్థులకు రూ.86,354లు విద్యాదీవెన నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేసినట్టు తెలిపారు. మొత్తం రూ.10,40,93,202 చెక్కును విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చదువులు సాగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, విద్యార్థినీ, విద్యార్థులుపాల్గొన్నారు.

నేరాలు తగ్గుముఖం

- పక్కా ప్రణాళికతో నేర నియంత్రణ
- సంచలనాత్మక కేసుల్లో వేగంగా దర్యాప్తు
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు
- మహిళలకు రక్షణ
- గతేడాది కంటే తగ్గిన కేసుల సంఖ్య
- సారా నిర్మూలనే లక్ష్యంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చర్యలు
- జిల్లా పోలీస్‌శాఖ వార్షిక నేర నివేదిక వెల్లడి



వార్షిక నేర నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం టౌన్: జిల్లా పోలీస్‌శాఖ కృషితో గతేడాది కంటే జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రత్యేక నిఘాతో దొంగతనాలు తగ్గాయి. మహిళలకు భద్రత చర్యలు పెరిగాయి. రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు సత్ఫలితాలిచ్చాయి. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ వార్షిక నేర నివేదికను వెల్లడించారు.

- జిల్లాలో 17 తీవ్రమైన నేరాల్లో శిక్షలు ఖరారయ్యాయి. వీటిలో మహిళలు, బాలికలపై జరిగిన ఏడు నేరాల్లో నిందితులకు 20 సంవత్సరాలు, యావజ్జీవ ఖైదు శిక్ష పడింది.
- జిల్లా పోలీస్ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. 2023 డిసెంబర్ 18వ తేదీ వరకు 382 ఫిర్యాదులు అందగా వాటిలో ఇప్పటికే 360 పరిష్కరించారు. 22 పెండింగ్ ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నాయి.
- మహిళలపై అఘాయిత్యాలు తగ్గుముఖం పట్టాయి. 2022లో రేప్ కేసులు 37 నమోదుకాగా, ఈ ఏడాది 24 కేసులు నమోదయ్యాయి. మహిళల గౌరవానికి భంగం కల్గించే కేసులు 2022లో 71 నమోదుకాగా, 2023లో 18 శాతం తగ్గి 58 కేసులు, పోక్సోకేసులు గతేడాది 29, ఈ ఏడాది 18, మైనర్ బాలికల అపహరణ కేసులు గతేడాది 20 నమోదు కాగా, ఈ ఏడాది 9 కేసులు మాత్రమే నమోదయ్యాయి. మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి మొత్తం 260 కేసులు నమోదు కాగా 2023లో 19 శాతం తగ్గి 211 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీవర్గాలపై 2022లో 41 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 15 శాతం తగ్గి 35 కేసులు రిజిస్టర్ అయ్యాయి. హత్యకేసులు 5 నమోదయ్యాయి.
- దొంగతనాలకు సంబంధించిన నేరాల్లో 2022లో రూ.78,46,100ల విలువైన ఆస్తులు చోరీకి గురికాగా, వాటిలో రూ.37,50,136ల విలువైన ఆస్తులు రికవరీ చేశారు. 2023లో రూ.50,66,860ల విలువైన ఆస్తులు చోరీకి గురికాగా, వాటిలో 52.21 శాతం కేసులను ఛేదించి 44.18 శాతం రూ. 22,38,894ల విలువైన ఆస్తులు రికవరీ జరిగింది. 2022లో 127 మిస్సింగ్ కేసులు నమోదుకాగా 115 మందిని వెతికి పట్టుకున్నారు. 2023లో 100 మంది తప్పిపోగా 88 మందిని పట్టుకొని, వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు సురక్షితంగా అప్పగించారు.

సెబ్ ఆధ్వర్యంలో...

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 2023లో సారా వ్యాపారం చేసేవారిపై 673 కేసులు నమోదు చేసి 23,679 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని 803 మందిని అరెస్టుచేశారు. 73 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యంనకు సంబంధించి 2023లో 205 కేసులు నమోదుచేయగా, 418 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 206 మందిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా

సైబర్ నేరాల సంఖ్య 2022లో 29 నమోదు కాగా, 2023లో 32 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, సైబర్ నేరాలు మోసాలు జరిగే తీరు, లోన్‌యాప్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరించినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి

2022లో రహదారి ప్రమాదాల్లో 267 కేసులు నమోదై, 77 మంది మృతి చెంది, 437 మంది గాయపడ గా... 2023లో స్వల్పంగా 3 శాతం కేసుల సంఖ్య పెరిగి 275 కేసులు నమోదై 95 మంది మృతి చెంది 389 మంది గాయపడ్డారు. గతేడాది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 125 నమోదు కాగా, 2023లో 2,781 కేసులు నమోదు చేశారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

సారా తయారీకేంద్రాలపై విస్తృతంగా దాడులు చేసి 540 కేసులు నమోదు చేశారు. 15,914 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, 609 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

గంజాయి కేసులు

గంజాయి అక్రమ రవాణా దారులపై 2022లో 9 కే సులు నమోదు కాగా 2023లో ప్రత్యేకంగా చెక్‌పో స్టులు ఏర్పాటు చేసి 14 కేసులు నమోదు చేసి, 27 మందిని అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి 205.64 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

7న బొబ్బిలిలో ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్



ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్ కరపత్రాలు చూపిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం: బొబ్బిలిలోని శ్రీకళాభారతి ఆడిటోరియంలో జనవరి 7వ తేదీన రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్(ఆంగ్లభాష ప్రతిభాపాటవ పోటీ పరీక్ష) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆంగ్ల భాషోపాధ్యాయుల అసోసియేషన్(డెల్టా) అధ్యక్షుడు మింది విజయమోహన్‌రావు తెలిపారు. మండలంలోని నందబలగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయుల అసోసియేషన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దాదాపు 12 ఏళ్లుగా అసోసియేషన్ ద్వారా ఆంగ్లభాష అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రతిఏటా ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులంతా ఈ పోటీలో పాల్గొని, విశేష ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. పరీక్ష రాయాలనుకునే వారు ఫోన్ నంబర్ 9440744741ను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పరీక్షలో విజేతలుగా నిలిచిన తొలి 10 మందికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేస్తామన్నారు. అనంతరం పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో తెర్లాం, బాడంగి మండలాల ఆంగ్లభాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్లుప్తంగా

తండ్రి అంతిమ రుణం తీర్చుకున్న తనయ


తండ్రి అంతిమ యాత్రలో తనయ మీనా

రాజాం: పట్టణానికి చెందిన ఓ యువతి తనను కనిపెంచి పెద్ద చేసిన తండ్రి అంతిమ సంస్కారాలు పూర్తిచేసింది. ఆ ఇంట్లో మగపిల్లలు లేని లోటును పూడ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రాజాం పట్టణ పరిధిలో డోలపేట గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మణరావు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. వీరిలో మూడవ కుమార్తె మీనా తన తండ్రి అంతిమ సంస్కారాలు పూర్తిచేసింది. ఆమెకు గ్రామస్తులు అండగా నిలిచారు. మీనా బుచ్చింపేట సచివాలయ వార్డు వలంటీర్‌గా పనిచేస్తోంది.

బైక్‌లు ధ్వంసం చేసిన ఏనుగులు


అటవీశాఖ అధికారి బైక్‌ను కాలితో తొక్కుతున్న ఏనుగు

భామిని: మండలంలోని మూలగూడ సమీపంలో ఏనుగులు శుక్రవారం విధ్వంసం సృష్టించాయి. ఏనుగుల జాడ తెలుసుకునేందుకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందిపై తిరగబడ్డాయి. వారి ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశాయి. కొత్తూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణమూర్తి బైక్‌ను తొక్కిపడేయగా, మరో ట్రాకర్ వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది.

ట్రాక్టర్ బోల్తా - యువకుడి మృతి


శ్రీరాములు మృతదేహం

బలిజిపేట: ట్రాక్టర్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సింగరాయబంద వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బలిజిపేట గ్రామానికి చెందిన ఎస్.శ్రీరాములు ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో వెంగాపురం రెవెన్యూ పరిధి సింగరాయబంద వద్దనున్న ఇటుకబట్టీ వద్ద ఇటుకుల తయారీకి ట్రాక్టర్‌తో మట్టిని సిద్ధం చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది.దీంతో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తిమృతి


దొంకినవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపక్కన పడిఉన్న గుర్తుతెలియని మృతదేహం

బాడంగి: మండలంలోని డొంకినవలస రేల్వే గేట్‌కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బొబ్బిలి రైల్వే పోలీసులు శుక్రవారం గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ... పూరి నుంచి అహ్మదాబాద్‌వైపు గురువారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ నుంచి మృతుడు జారిపడిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు 30 ఏళ్లు ఉంటుంది. పట్టాలకు, రైలు చక్రాలకు మధ్య పడిపోవడంతో నడుం సగభాగానికి కట్ అయిపోయింది. స్టేషన్ మాస్టారు ఫిర్యాదు మేరకు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ దొరికాయని, పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. విజయనగరం రైల్వే ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదుచేశారు. జీన్‌ప్యాంట్, నెక్‌బనియన్ కలిగి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు సెల్: 94906 17089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికెన్

రిబ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన

- చేసిన మంచిని చూసి ఓటేయండి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ


వెదుళ్లవలస గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిపాలన సాగుతోందని, చేసిన మంచిని చూసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే దగా మాటలను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో రూ.3.84కోట్ల నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, చీపురుపల్లి ప్రధాన రోడ్డు నుంచి వెదుళ్లవలస మీదుగా గర్భాం జంక్షన్ వరకు రూ.8.40 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అయన మాట్లాడారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో 17 గ్రామాలకు, 700 వ్యవసాయ కనెక్షన్లకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. వెదుళ్లవలస పంచాయతీలోని లబ్ధిదారులకు నాలుగన్నరేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.23 కోట్ల ఆర్థిక లబ్ధిని నేరుగా ఖాతాలకు జమచేసినట్టు గుర్తుచేశారు. రూ.2.26 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వసేవలను ప్రజలకు చేరువచేసినట్టు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎందుకు ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయలేదో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను బాగు చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించాలన్నారు. గత ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి పసుపు కుంకుమతో సరిపెట్టారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా పథకం రావాలంటే తులమో, ఫలమో ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే ఆలోచిస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్యఖర్చు పరిధిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచి పేదకుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, స్థాయిని, వయస్సును చూసి మాట్లాడాలని హితవు పలికారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 90 శాతం హామీలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్ నిర్మాణాలు, తాగునీటి సౌకర్యాలు, రోడ్ల నిర్మాణాలన్నీ ఈ ప్రభుత్వంలో చేసినవేనని తెలిపారు.
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా ఎన్నో శాశ్వత కార్యక్రమాలు చేశామన్నారు. వంద ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి రైతులను హక్కుదారులను చేసే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణలకు ఆశీస్సులు అందించాలని కోరారు. సమావేశానికి అగ్రికల్చర్ అసిస్టెంట్ హాజరుకాకపోవడంపై మంత్రి మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన వివరాలు తెలియజేయాలని సూచించినప్పుడు అందుబాటులో లేకపోతే ఎలా అని వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. ఎందుకు హాజరుకాలేదో వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, వైస్ సర్పంచ్ గుడివాడ శ్రీరాములనాయుడు, వెంకటఅప్పలరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


రూ.8.4 కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ


రూ.3.84 కోట్లతో చేపట్టనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు జెడ్పీ నిధులు


రూ. లక్ష చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు జెడ్పీ నిధులు సమకూర్చారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి క్రీడల నిర్వహణకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు లక్ష రూపాయలను గురువారం తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో లెండి విద్యార్థుల ప్రతిభ


నిర్వాహకుల నుంచి చెక్కు అందుకుంటున్న లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

డెంకాడ: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023లో లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్‌లోని బిలాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రూ. లక్ష నగదు బహుమతి సాధించారు. పి.ధన్యశ్ర నేతృత్వంలోని విద్యార్థులు వి.సాయికృష్ణ, ఎస్.శాంతికుమారి, పి.నరసింహ, ఎస్.శ్రీను, పి.వివేక్‌లతో కూడిన బృందం ప్రతిభ చాటింది. మెంటార్ ఎస్.సురేష్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, సీఎస్ఎస్ఈ విభాగాధిపతి ఆర్.రాజేందర్ ప్రోత్సాహంతో రాణించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

దక్షిణ భారత స్థాయి సైన్స్ పోటీలకు జిల్లా ప్రాజెక్టు


రాష్ట్రస్థాయి పోటీలలో విజేతగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థిని ఐ.హాసిని, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రామకృష్ణ

విజయనగరం అర్బన్: విజయవాడలో వచ్చే నెల 27, 28, 29వ తేదీల్లో జరగనున్న దక్షిణ భాతర స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు రాజాం మండలం డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఐ.హాసిని రూపొందించిన 'స్మార్ట్ ట్రాలీ' వైజ్ఞానికప్రాజెక్టు ఎంపికైంది. కడపలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి ప్రదర్శించిన తొమ్మిది ప్రాజెక్టులలో స్మార్ట్ ట్రాలీ ప్రాజెక్ట్ ఎంపికైందని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి పర్యవేక్షణలో ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థినికి డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీరావు, వాసుదేవరావు అభినందించారు.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నీరజ ప్రతిభ



కాంస్య పతకాన్ని చూపిస్తున్న క్రీడాకారిణి నీరజ

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి అ జరుగుతున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి బాలి నీరజ కాంస్య పతకం సాధించింది. శుక్రవారం జరిగిన 40 కిలోల విభాగం పోటీలో నీరజ స్నాచ్‌లో 53 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 60 కిలోలు...మొత్తంగా 113 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన నీరజకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, వెంకటరామయ్య, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.

దీపకాంతుల శోభలో సీతారామచంద్రస్వామి


దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేయించారు. అనంతరం దీపాలను వెలిగించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి


డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: నగరంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ అభ్యర్థించింది. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కోలగట్లను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు పంచాది అప్పారావు, జె.శేషగిరి, సముద్రాల నాగరాజు, రవి, డేవిడ్ రాజు, తదితరులున్నారు.

'పీఎం జన్ మాన్'తో మరింత ప్రయోజనం

- కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్


పార్వతీపురం టౌన్: అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సీతంపేట: పీఎం జన్ మాన్ పథకం కింద పీవీటీజీ గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మరిన్ని ప్రత్యేక పథకాలు అందించనున్నట్టు కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్ తెలిపారు. మండలంలోని అక్కన్నగూడ గ్రామాన్ని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారితో కలిసి శుక్రవారం సందర్శించిన ఆమె జన్ మాన్ పథకం కింద అందిస్తున్న 11 రకాల పథకాలను వివరించారు. పథకాల మంజూరుకు లబ్ధిదారుల కోసం సర్వే జరుగుతోందని, ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇప్పటివరకు గృహాలు లేని వారికి, పూరిళ్లలో నివసిస్తున్న వారికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు మరిన్ని పథకాలు వర్తింపజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

త్వరగా సర్వే పూర్తి చేయండి..

పార్వతీపురంటౌన్: పీఎం జన్ మాన్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయండి అని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన గిరిజనుల గృహ నిర్మాణాలపై సమీక్షించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లోని ఆదివాసీ గిరిజనుల(పీవీటీజీ)ను పూర్తిస్థాయిలో సర్వే చేసి, అర్హులై, గృహాలు లేని వారి జాబితాను తయారు చేయాలని సూచించారు. జన్ మాన్ కార్యక్రమం కింద అర్హులందరికీ గృహాలు మంజూరవుతాయన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డీఈలు ప్రసాద్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్.. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారితో కలిసి శుక్రవారం పర్యటించి, అక్కడి వారికి పీఎం జన్ మాన్ పథకం కింద ఆదివాసీ గిరిజనులకు అందిస్తున్న 11 రకాల పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారంతా సర్వే సిబ్బందికి పేర్లు ఇవ్వాలని తెలిపారు.


సీతంపేట: గిరిజనులతో కలిసి పథకాల బుక్‌లు చూపిస్తున్న కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి బిస్మితాదాస్

సార్వత్రిక ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడడంపై దృష్టిసారించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన డిసెంబర్ నెల నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు కొద్దినెలల్లో జరిగే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అతి జాగ్రత్తతో విధులు నిర్వహించాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా అవి సంచలనంగా మారే అవకాశం ఎక్కువన్నారు. ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో ఏఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ సునీల్ షారోన్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత, పాలకొండ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి జీవీ కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ జి.మురళీధర్, డీసీఆర్‌బీ సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, జిల్లా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



జామి: ధనుర్మాస ఉత్సావాల్లో భాగంగా మండలంలోని కుమరాం ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఏడీఏ నాగభూషణం


కనకదుర్గ రైస్ మిల్లు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: రైతులు మిల్లులకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఏడీఏ నాగభూషణం మిల్లర్లను ఆదేశించారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గ రైస్ మిల్లును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తూకం, తేమశాతం కొలిచే పరికరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరించాలని సూచించారు. ఒక్క గింజ ఎక్కువగా తీసుకున్నా సంబంధిత మిల్లుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రావివలస రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ట్రక్ షీట్, ఎఫ్‌టీఓలో సమస్యలు ఏవైనా ఉన్నాయా అని రైతులను అడిగితెలుసుకున్నారు. అక్కడ నుంచి లక్కిడాం జంక్షన్‌లో ఉన్న వేంకటేశ్వర ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్, ఏఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.